క్లుప్తంగా

పాఠశాలలో వసతులు కల్పించాలని వినతి



బీబీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆసీఫ్ గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోలార్, వాటర్ ట్యాంకులు, గీజర్లు, బట్టలు ఉతుక్కునేందుకు ప్లాట్‌ఫామ్ సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద మంజూరైన పనులు ప్రారంభించారు. రూ.9 లక్షలతో మరుగుదొడ్లు, నీరు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు గునిగెరి హన్మండ్లు తెలిపారు. పాఠశాల గదుల్లో కొత్తగా బండలు వేస్తున్నారు.

చెత్తను రోజూ సేకరించాలి



నాగిరెడ్డిపేట: చెత్తను రోజూ సేకరించాలని ఎంపీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణవేణిని ఆదేశించారు. మండలంలోని అక్కంపల్లి పంచాయితీ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్రీడాప్రాంగణం పనులు పూర్తి చేయాలని సర్పంచ్ లక్ష్మికి ఆయన సూచించారు.

బకెట్లు, మగ్గులు పంపిణీ



పిట్లం: మండల కేంద్రమైన పిట్లం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం మండలంలోని ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు బకెట్లు, మగ్గులు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన బకెట్లు, మగ్గులు వాడటంతో పాటు ఆరోగ్య సిబ్బంది చెప్పిన సూచనలు పాటించాలని హెల్త్ సూపర్ వైజర్లు వారికి సూచించారు.

ఫిజియోథెరపితో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: దివ్యాంగులైన విద్యార్థులకు రోజూ ఫిజియోథెరపీ చేయిస్తే సత్ఫలితాలు వస్తాయని స్థానిక భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు డాక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఐఈఆర్పీ అర్జున్ ఉన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

బిచ్కుంద: బిచ్కుంద గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీరేఖ చెక్ పవర్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ఆగస్టులో పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన కార్డులను సర్పంచ్ తీసుకొని, వాటిని తీసుకెళ్లాలని నిబంధనలకు విరుద్ధంగా దండోరా వేయించి, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైఎస్సార్‌టీపీ నేతల ఆర్థిక సహాయం



సదాశివనగర్: కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో భూమిని చేర్చడంతో ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్న అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రైతు పయ్యావుల రాములు కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పి.రాము, మహ్మద్ తాహీర్, కల్లెం రాజు, మధుసూదన్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎలిగల రాజు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు.. పనులు మరిచారు

- బాన్సువాడలో కొన్ని వార్డులకు అందని మిషన్ భగీరథ నీళ్లు
- బోరు నీళ్లపైనే ఆధారం

బాన్సువాడ టౌన్: ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోక పోవడంతో బాన్సువాడలో ఆశించిన మేరకు ఆ ఫలాలు ప్రజలకు అందడం లేదు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో ఉంటే ఉదయమే వార్డుల్లోకి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటారు. మున్సిపాలిటీ పరిధిలో చిన్న సమస్య తన దృష్టికి వచ్చినా స్పీకర్ ప్రత్యేక శ్రద్ధ చూపి ఆ సమస్యను వెంటనే పరిష్కరించేలా తక్షణం చర్యలు తీసుకుంటారు. అయితే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాసవీకాలనీ, అర్బత్‌కాలనీ, హనుమాన్ గల్లీ వాసులకు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా కావడం లేదు. కుళాయిల ఏర్పాటు కోసం గుంతలు తవ్వి నెలలు గడుస్తున్నా పైపులైన్ వేయడం లేదు. దీంతో ఆయా కాలనీలకు చెందిన వారు వీధుల్లో ఉన్న బోరు నీటిపైనే ఆధారపడుతున్నామని పలు కాలనీ వాసులు ఆవేదన చెందారు.



వాసవీ కాలనీలో నడి రోడ్డుపై తవ్వినగుంత



పైపులైన్ కోసం తవ్వి వదిలేసిన గుంత

నీళ్ల కోసం ఎదురు చూస్తున్నాం



మిషన్ భగీరథ నీటి కోసం ఎదురు చూస్తున్నాం. పైప్‌లైన్ కోసం గుంతలు తవ్వి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

–బోద నారాయణ, అర్బత్ కాలనీ

అడుగుతున్నా స్పందన లేదు



పనులు వెంటనే పూర్తి చేసి తాగు నీటి సరఫరా చేయాలని అడుగుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–ఇసాక్ చావూస్, అర్బత్ కాలనీ

త్వరలో నీటి సరఫరా

వాసవీ, అర్బత్ కాలనీల్లో కొన్ని చోట్ల మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. పైపులైన్ పనులు త్వరలో పూర్తి చేసి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

–రమేష్, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

సమ్మేళనానికి హాజరు కావాలి



మాట్లాడుతున్న బీజేపీ పాలక్ సుహాసినిరెడ్డి

రాజంపేట: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వచ్చే నెల 7న నిర్వహించనున్న బూత్ స్థాయి సమ్మేళనానికి కార్యకర్తలు హాజరు కావాలని బీజేపీ కామారెడ్డి పాలక్ సుహాసినిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని శివాయిపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు గంగారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు బక్కి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డిలో మాట్లాడుతున్న వేణుమాధవ్

సైనికుల్లా పని చేయాలి

మాచారెడ్డి: బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ కామారెడ్డి అసెంబ్లీ ప్రభారి తేలు వేణుమాధవ్ పిలుపునిచ్చారు. మండలంలోని చుక్కాపూర్‌లో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. 7న నిర్వహించనున్న మహా సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నర్సింహచారి, నరేష్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట బాల్‌రాజు పాల్గొన్నారు.

అదనపు బస్సుల ఏర్పాటుకు స్పీకర్ ఆదేశం



బాన్సువాడ టౌన్: బాన్సువాడ మండలం కొత్తాబాది మోడల్ స్కూల్ వరకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆర్టీసీ డీఎం సాదాశివ్‌ను ఆదేశించారు. కొయ్యగుట్ట వద్ద మోడల్ స్కూల్ నుంచి వస్తున్న బస్సును స్పీకర్ ఆపారు. విద్యార్థులతో బస్సు కిక్కిరిసి ఉండటాన్ని చూసి అదనపు బస్సులు తిప్పాలని సూచించారు. సమస్యను అక్కడికక్కడే పరిష్కరించినందుకు స్పీకర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

తొలిమెట్టుతో విద్యార్థుల్లో మేధాశక్తి

లింగంపేట: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా టీఎల్ఎం మేళాతో విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని ఎంఈవో రామస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన మేళాను ఎంపీపీ గరీబున్నీసాబేగం ప్రారంభించారు. మండలంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తాము నిత్యం బోధిస్తున్న కృత్యాలను ప్రదర్శించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధన సమయంలో కృత్యాలు ఉపయోగించి బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ బోధనలో ఉపాధ్యాయులు నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వహీద్‌సిద్దిఖీ, నాగరాజు పాల్గొన్నారు.



మేళాను తిలకిస్తున్న ఎంపీపీ గరీబున్నీసాబేగం

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



రాజంపేట: పంట సాగుకు సంబంధించి నీటి పొదుపు, తెగుళ్ల నివారణ తదితర వాటిపై పద్మపాని సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండల రైతు వేదిక భవనంలో రైతుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఏవో జ్యోత్స్న, ఏఈవో శ్రీకాంత్, రైతుబంధు జిల్లా సమన్వయ కర్త బాల్‌రెడ్డి, సంస్థ కో ఆర్డినేటర్ కొప్పుల రవి, నాయకులు చింతల స్వామి, బాలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



టీజీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు ఆర్.దేవేందర్, కార్యదర్శి బి.సాయిరెడ్డి, సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు జలిగం శ్రీనివాస్, సుంకరి భూమయ్య, చిన్నారెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్..

టీడీఎఫ్ క్యాలెండర్‌ను డీఈవో ఎస్.రాజు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సి.ప్రభాకర్, దేవులా, బాలయ్య, గంగారాం, వంశీధర్, శ్రీకాంత్, చిన్నరాజయ్య తదితరులు పాల్గొన్నారు.



డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

పీఆర్‌టీయూ క్యాలెండర్..

సదాశివనగర్: పీఆర్‌టీయూ క్యాలెండర్లను మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాధారి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో యోసెఫ్, విండోచైర్మన్ కమలాకర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వడ్ల రాజేందర్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వనం కోసం స్థల పరిశీలన

తాడ్వాయి: మండలంలోని సంతాయిపేట్‌లో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు కోసం గురువారం ఎంపీడీవో రాజ్‌వీర్ స్థలాన్ని పరిశీలించారు. వనం ఏర్పాటు చేస్తే భీమేశ్వరాలయానికి వచ్చే యాత్రికులకు కూడా దోహద పడుతుందన్నారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సర్పంచ్ భాగ్యలక్ష్మీ, టెక్నికల్ అసిస్టెంటు మహిపాల్‌రెడ్డి, ఫీల్డు అసిస్టెంట్ హన్మంతురెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్క జొన్న పంట పరిశీలన

గాంధారి: మండలంలోని కరక్‌వాడి గ్రామంలో జీవ నియంత్రణ పద్ధతిలో సాగు చేసిన మొక్క జొన్న పంటను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న గురువారం పరిశీలించారు. చీడ పీడల నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధారి రైతు వేదికలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్ యోజన, ఈకేవైసీ, రైతు బంధు, రైతు భీమా, పంటల నమోదు తదితర అంశాలపై ఏవోలు, ఏఈవోలను అడిగి తెలుసుకున్నారు.



మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రత్న

భూ పోరాటం ఉధృతం చేయాలి

సదాశివనగర్: భూ పోరాటాన్ని ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ సూచించారు. మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కులను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు చంద్రశేఖర్ మోతిరాం, సాయిలు, మధు తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి



బిచ్కుందలో ధర్నా చేస్తున్న పీఠాధిపతులు, అయ్యప్పస్వామి భక్తులు

బిచ్కుంద: హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెంజర్ల రాజేష్, బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని బండయప్ప మఠం పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా గురువారం బిచ్కుందలో దుకాణాలు బంద్ చేశారు. సోమయప్ప స్వామి మాట్లాడుతూ దురుద్దేశంతో దేవతలను కించపరిచే విధంగా మాట్లాడారని అన్నారు. ఖద్గాం మఠం పీఠాధిపతి శ్రీ మల్లికార్జున్ స్వామి, అయ్యప్పస్వామి భక్తులు బాల్‌రాజ్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

బాన్సువాడ టౌన్: కోటగిరి మండల తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై జరిగిన దాడికి నిరసనగా గురువారం బాన్సువాడలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి అయ్యాల సంతోష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు చంద్రశేకర్, లక్ష్య, రాచప్ప, శకుంతల, లాల్‌సింగ్, సాయిలు, మనెమ్మ, విజయ్, రవళి పాల్గొన్నారు.

మాచారెడ్డి: కోటగిరి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించిన వారిని మండల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దేవసంజీవ్, ఉపాధ్యాయులు బాలయ్య, గంగారాం, రాజు, రూప్‌సింగ్ పాల్గొన్నారు.



బాన్సువాడలో నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

మహాసభలను విజయవంతం చేయాలి

బాన్సువాడ టౌన్: బెంగుళూరులో ఈ నెల 11న నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధాల సంఘాల జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మావురం శ్రీకాంత్ కోరారు. గురువారం బాన్సువాడ ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎంఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని 28 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, నాయకులు కృష్ణ, చంద్రకాంత్, సచిన్, విజయ్, బాల్‌రాజ్, యోగేష్, బాలజీ, అజయ్, సాయికుమార్, అభిషేక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

రామారెడ్డి: బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేష్ ఖాతాదారులకు సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాబార్డు ఆధ్వర్యంలో మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ నరేష్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, ఫోన్ బ్యాంకింగ్, ఏటీఎం సేవల గురించి తెలుసుకుంటే సైబర్ మోసాలకు గురి కాకుండా ఉండొచ్చన్నారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న ప్రమాద బీమా తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జీర్ల లావణ్య, ఉపసర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ నరేష్

స్వదేశీ ఉత్పత్తులు వాడాలి

కామారెడ్డి అర్బన్: స్వదేశీ ఉత్పత్తుల వాడకంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాందేవ్ బాబా, స్వర్గీయ రాజీవ్ దీక్షిత్ ఏర్పాటు చేసిన భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ప్రజల మన్ననలు పొందుతోందని ట్రస్ట్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి స్నేహపురి కాలనీలోని పతంజలి యోగా కేంద్రంలో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పి.అంజయ్య, కేసీద్దాగౌడ్, లక్ష్మీపతియాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ట్రస్టు వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

ఆధ్యాత్మికం

హనుమాన్ భజన మండలి కీర్తనలు



సదాశివనగర్: తిరుమల తిరుపతి దేవస్థానంలో బుధవారం జరిగిన అఖండ హరినామ సంకీర్తనలో మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన హనుమాన్ భజన మండలి సభ్యులు భజన కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాగౌడ్, బాల్‌రాజు, రాజు, లింగం, రాజిరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు..

కామారెడ్డి: పట్టణం దేవునిపల్లి శ్రీ రమాసత్యనారాయణస్వామి ఆలయం, లింగాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శశికాంత్‌శర్మ, రవికాంత్ తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులు ఉదయం 9 గంటలకే ఆలయాలకు చేరుకోవాలని వారు కోరారు.

సాయిమందిరంలో పూజలు



కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం అభిషేకం, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు విజయ్‌కుమార్, సర్పంచ్ జూకంటి సుమిత జనార్ధన్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాస్, మల్లయ్యసార్, పొన్నాల నర్సింలు, జగదీశ్వర్, వీరప్ప పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ అధ్వర్యంలో ప్లేట్లను పంపిణీ చేశారు.

8 నుంచి క్రికెట్ టోర్నమెంట్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని కొమలంచ గ్రామంలో 8వ తేదీ నుంచి మత్తడి పోచమ్మ ఆలయ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాదుల ప్రవీణ్, కిరణ్‌గౌడ్, రాజాగౌడ్ తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేవారు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండలంలోని దేవాయిపల్లి, ఎర్రాపహాడ్, తాడ్వాయిలలో ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులువాహనాలను తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్వ గ్రామ అంగన్‌వాడి కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు వివరాలు తెలుసుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్: ఇంటి పరసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ తిర్మల్ రెడ్డి సూచించారు. పంచాయతీ సిబ్బందితో ఆయన డ్రైనేజీలను శుభ్రం చేయించారు.

దళితబంధు వాహనం అందజేత

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామ పంచాయతీలో దళితబంధు పథకం కింద మంజూరైన హార్‌వెస్టర్ వాహనాన్ని గురువారం వైస్ ఎంపీపీ మనోహర్ లబ్ధిదారుడికి అందజేశారు.

కిట్లు అందుబాటులో ఉంచాలి

దోమకొండ: ప్రభుత్వ ఆస్పత్రిలో న్యూట్రిషిన్ కిట్లు అందుబాటులో ఉంచాలని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మన్‌సింగ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శోభరాణిలను కలిసి వినతిపత్రం అందజేశారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడలు

పెద్దకొడప్‌గల్: యూత్ డే సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 7, 8 తేదీల్లో క్రికెట్, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం గ్రామాల వారీగా జట్టు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

మొక్కలను కాపాడాలి

పిట్లం: నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలని పంచాయితీ కార్యదర్శి యాదగిరి పేర్కొన్నారు. మండలంలోని గద్దగుండు తండాలో మొక్కలు నాటించారు.

స్పీకర్ పరామర్శ

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. నాగేశ్వర్‌రెడ్డి మాతృమూర్తి బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. స్పీకర్ వెంట సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

పిట్లం: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.